సాక్షి నిజామాబాద్

ఆదివారం । 2 । జూన్ । 2024



రైతుల ఆందోళన

తమ వ్యవసాయభూములకు విద్యుత్ లైన్ పనులను నిలిపివేశారని కమ్మర్‌పల్లి తహసీల్ ఎదుట రైతులు నిరసన తెలిపారు.

- 8లో ▸



అంతర్జాతీయ క్రీడాకారిణికి..

అంతర్జాతీయ టెన్నిస్‌బాల్ క్రికెట్ క్రీడాకారిణి మౌనికను మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సన్మానించారు.

- 9లో ▸

గరిష్టం/కనిష్టం

42.7 /30.4

వాతావరణం

ఉదయం ఎండ తీవ్రత కాస్త తగ్గుతుంది. ఉక్కపోతగా ఉంటుంది. వడగాలులు వీస్తాయి. ఆకాశం మేఘావృతమవుతుంది.

న్యూస్‌రీల్

ఆస్పత్రిలో డీఎస్



ఖలీల్‌వాడి: పీసీసీ మాజీ అధ్యక్షుడు, మాజీ మంత్రి, మాజీ ఎంపీ ధర్మపురి శ్రీనివాస్ ప్రైవేట్ ఆస్పత్రిలోచికిత్స పొందుతున్నట్లు ఎంపీ అర్వింద్ శనివారం రాత్రి ట్వీట్ చేశా రు. డీఎస్‌కు యురినల్ ట్రాన్ ఇన్ఫెక్షన్, సోడియం లాస్ ఉన్నట్లు వైద్యులు తెలిపారని పేర్కొన్నారు. ప్రస్తుతం ఐసీయూలో చికిత్స పొందుతున్నారని తెలిపారు.

జీజీహెచ్‌లో న్యూరాలజీ సేవలు

నిజామాబాద్‌నాగారం: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి(జీజీహెచ్)లో న్యూరాలజీ సేవలు అందుబాటులోకి వచ్చాయని సూపరింటెండెంట్ డాక్టర్ ప్రతిమా రాజ్ తెలిపారు. జీజీహెచ్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. రెండు నెలల క్రితం న్యూరో సర్జరీ సేవలు ప్రారంభించామన్నారు. ఇప్పటి వరకు హైదరాబాద్, వరంగల్‌లో మాత్రమే న్యూరో శస్త్ర చికిత్స చేసేవారని, నిజామాబాద్ జీజీహెచ్‌లో సేవలు అందుబాటులోకి వచ్చాయని తెలిపారు. ఇప్పటివరకు 20మందికి న్యూరో సర్జరీలు చేశామన్నారు. రోగులకు సేవలందిస్తున్న డాక్టర్ వెంటరమణారెడ్డి, వైద్యుల బృందానికి ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. సమావేశంలో వైద్యులు, రోగులు పాల్గొన్నారు.

పనులను నాణ్యతతో పూర్తి చేయించాలి



నిజామాబాద్‌అర్బన్: పాఠశాలల్లో మౌలిక వసతులను మెరుగుపర్చేందుకు అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఆధ్వర్యంలో చేపడుతున్న పనులను నాణ్యతతో పూర్తి చేయించాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు అధికారులకు సూచించారు. జిల్లా కేంద్రంలోని అర్సపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలను కలెక్టర్ శనివారం సందర్శించి పనులను పరిశీలించారు. తరగతి గదులు, కిచెన్ షెడ్, నీటి సంపు తదితర చోట్ల కొనసాగుతున్న పనులను తనిఖీ చేసి, అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అవసరమైన పనులను మాత్రమే చేపట్టి పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అన్ని పాఠశాలల్లో పనులను పరిశీలించాలని డీఈవోను ఆదేశించారు. ప్రతి పాఠశాలలో నీటివసతి, టాయిలెట్స్ తప్పనిసరి ఉండాలని, ఆవరణను శుభ్రం చేయించాలన్నారు. కలెక్టర్ వెంట డీఈవో దుర్గాప్రసాద్ తదితరులున్నారు.

ఇజ్రాయిల్‌లో ఉద్యోగాల పేరిట టోకరా



కామారెడ్డి క్రైం: ఇజ్రాయిల్‌లో మంచి ఉపాధి అవకాశాలు ఉన్నాయని నమ్మించి రూ. లక్షల్లో డబ్బులు వసూలు చేసి కార్యాలయానికి తాళం వేసి ఉడాయించిన ముగ్గురిని పట్టణ పోలీసులు శనివారం అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించారు. పట్టణ ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్‌రెడ్డి కథనం ప్రకారం.. ఆర్మూర్ పట్టణానికి చెందిన మీసాల కిరణ్, గుజ్జుల విజయ్, హైదరాబాద్‌కు చెందిన మహమ్మద్ అలీ ముగ్గురు కలిసి కామారెడ్డిలోని ఎన్జీవోస్ కాలనీలో ఓ భవనాన్ని అద్దెకు తీసుకుని డెక్కన్ అబ్రాడ్ ఎడ్యుకేషనల్ కన్సల్టెన్సీ పేరిట ఓ సంస్థను ప్రారంభించా రు. తక్కువ ఖర్చుతో ఇజ్రాయిల్‌కు పంపిస్తా మని చాలా మందిని నమ్మించారు. కామారెడ్డితోపాటు చుట్టు పక్కల ప్రాంతాలకు చెందిన దాదాపు 60 మంది నుంచి రూ. 17 లక్షల వరకు వసూలు చేసిన తర్వా త బోర్డు తిప్పేశారు. వీసాల కోసం తాము డబ్బులు చెల్లించామని.. కానీ నిర్వాహకులు కార్యాల యానికి తాళంవేసి పరారయ్యారని గత నెల 15న కొందరు పోలీసులకు ఫిర్యాదు చేశా రు. కేసు నమోదు చేసిన పోలీసులు నిందితులను పట్టుకోవడానికి ప్రత్యేక బృందాలను నియమించారు. సదరు వ్యక్తులు శనివారం రెండు కార్లలో కార్యాలయం వద్ద కు రాగా పోలీసులు వారిని అదుపులోకి తీ సుకుని విచారించారు. నిందితుల్లో మీసాల కిరణ్ అనే వ్యక్తి ఆధార్ కార్డులో తన పేరును క్రాంతికుమార్‌గా మా ర్చుకోవడమే కాకుండా అడ్రస్ మార్చివేశాడ ని పోలీసులు గుర్తించారు. గుర్తు తెలియని వ్యక్తి పేరు మీద ఫెడరల్ బ్యాంకులో ఖాతా తెరిచి బాధితుల నుంచి వచ్చిన డబ్బును అందులో జమ చేశాడని ఎస్‌హెచ్‌వో వెల్లడించారు. ఇంకా ఎవరైనా బాధితులుంటే తమను సంప్రదించాలన్నారు.



- వేడుకలకు ముస్తాబైన కలెక్టరేట్
- జాతీయ పతాకాన్ని ఆవిష్కరించనున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

నేడు తెలంగాణ అవతరణ వేడుకలు

సుభాష్‌నగర్: తెలంగాణ రాష్ట్ర అవతరణ వేడుకలకు జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ముస్తాబైంది. కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్ అధికారులతో కలిసి శనివారం ఏర్పాట్లను సమీక్షించారు. ఐడీవోసీలో నిర్వహించనున్న రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలకు కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై ఉదయం 9 గంటలకు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించనున్నారు. అంతకుముందు వినాయక్‌నగర్‌లోని అమరవీరుల స్తూపానికి శ్రద్ధాంజలి ఘటించనున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, పుర ప్రముఖులు వేడుకలకు హాజరుకానున్న నేపథ్యంలో జిల్లా యంత్రాంగం పకడ్బందీ ఏర్పాట్లు చేసింది. కలెక్టరేట్‌ను రంగు రంగుల విద్యుద్దీపాలతో ముస్తాబుచేశారు.



నగరంలోని పులాంగ్ చౌరస్తాలో విద్యుత్ దీపాల అలంకరణ



కలెక్టరేట్‌లో ఏర్పాట్లు..

పదేళ్ల ప్రగతి బాట

- జయహో తెలంగాణ
- జిల్లాలో 33కు చేరిన మండలాలు, 530కు చేరిన గ్రామపంచాయతీలు
- పంచాయతీలుగా మారిన తండాలు
- నిజామాబాద్‌లో ఐటీ టవర్ ఏర్పాటు
- ఆర్మూర్‌లో లెదర్ పార్క్, పడగల్‌లో స్పైసెస్ పార్క్
- ఎస్సారెస్పీ పునరుజ్జీవం అంతంతే.. ఎకోటూరిజం ఊసే లేదు
- ప్రత్యేక రాష్ట్రంలో జిల్లా అభివృద్ధి, సంక్షేమంపై కథనం..

పదేళ్ల తెలంగాణ రాష్ట్రంలో ఇందూరు జిల్లా ప్రగతి బాట పట్టింది. లక్ష ఎకరాలకు పైగా సాగు విస్తీర్ణం పెరిగింది. జిల్లా కేంద్రంలో ఐటీ హబ్, సమీకృత కలెక్టరేట్ భవన సముదాయం ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. మిషన్ కాకతీయ కింద చెరువులను పునరుద్ధరించారు. మండలాలు, జీపీల సంఖ్య పెంపుతో పాలన ప్రజల చెంతకు చేరింది. రూ. వెయ్యి కోట్లతో ఎస్సారెస్పీ పునరుజ్జీవన పథకం పనులు ప్రారంభించారు.



'పునరుజ్జీవన' పంప్‌హౌస్



మంచిప్ప జలాశయం వద్ద పనులు



రివర్స్ పంపింగ్ ద్వారా వరద కాలువకు వచ్చిన నీళ్లు



నిజామాబాద్‌లో ఐటీ టవర్

10 వసంతాల తెలంగాణ

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: సబ్బండ వర్ణాల పోరాటం, ఉద్యమాల ఫలితంగా సాధించుకున్న తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం పదేళ్ల కాలాన్ని పూర్తి చేసుకుంది. వరుసగా రెండుసార్లు అధికారం దక్కించుకున్న బీఆర్‌ఎస్‌కు బ్యాలెట్ పరంగా.. మొదటిసారి జిల్లా ప్రజాపరిషత్ విజయాన్ని అందించిన ఇందూరు జిల్లా ఉద్యమ ప్రస్థానంలో తనకే ప్రత్యేకమైన పేజీని ఏర్పాటు చేసుకుంది.

■ 2016 అక్టోబర్ 9న దసరా రోజున పరిపాలన వికేంద్రీకరణ చేశారు. నిజామాబాద్ నుంచి ప్రత్యేకంగా కామారెడ్డి జిల్లా ఏర్పాటైంది. ఇక నిజామాబాద్ జిల్లాలో కొత్తగా ఇందల్వాయి, మోపాల్, నిజామాబాద్ నార్త్, నిజామాబాద్ సౌత్, ఆలూ రు, డొంకేశ్వర్, ఏర్గట్ల, ముప్కాల్, మెండోరా, సాలూర, రుద్రూర్, చందూర్, మోస్రా, పోతంగల్ కొత్త మండలాలు ఏర్పాటయ్యాయి. దీంతో మొత్తం మండలాల సంఖ్య 33కు చేరింది. అదేవిధంగా తండాలను గ్రామపంచాయతీలుగా చేశారు. కొత్తగా 151 పంచాయతీలు చేశారు. జిల్లాలో పంచాయతీల సంఖ్య 530కు చేరుకుంది. అన్ని పంచాయతీల పరిధిలో పల్లె ప్రకృతి వనాలు, శ్మశాన వాటికలు, క్రీడా ప్రాంగణాలు నిర్మాణం అయ్యాయి. కాగా వ్యవసాయంలో అగ్రభాగంలో ఉన్న ఇందూరు జిల్లాకు ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలు మా త్రం ఇప్పటివరకు రాలేదు. లక్కంపల్లిలో ప్రత్యేక ఆర్థిక మండలి ఉన్నప్పటికీ యూనిట్ల స్థాపనలో అడుగులు ముందుకు పడలేదు.

వేల్పూర్ క్రాస్‌రోడ్డు వద్ద స్పైసెస్ పార్క్ కోసం 70 ఎకరాలు భూసేకరణ చేసినప్పటికీ అతీగతీ లేదు. ఇదిలా ఉండగా నిజామాబాద్ నగరంలో సమీకృత కలెక్టరేట్, ఐటీ హబ్ నిర్మాణం పూర్తి చేసుకుంది.

■ 2014లో జిల్లాలో పంటల సాగు విస్తీర్ణం 4,14,197 ఎకరాలు ఉండగా, 2024 నాటికి 5,25,900 ఎకరాలకు చేరింది. ఇందులో వరి పంట గణనీయంగా 2 లక్షల ఎకరాల మేర పెరిగింది. ఇక 2018 లో రాష్ట్ర ప్రభుత్వం పంట పెట్టుబడి సాయాన్ని జిల్లాలో 2.60 లక్షల మంది రైతులకు ఎకరానికి రూ.5 వేల చొప్పున అందించడం మొదలుపెట్టింది. అదేవిధంగా ఇప్పటి వరకు 5,855 మంది రైతుల కుటుంబాలకు రైతు బీమా డబ్బులు రూ.5 లక్షల చొప్పున అందించారు. ఇక జిల్లాలో పోడు భూములకు సంబంధించి మొత్తం 14,093 దరఖాస్తులు రాగా అందులో 4,229 మంది దరఖాస్తుదారులకు పట్టాలు ఇచ్చారు.

■ జిల్లాలో పసుపు సాగు గణనీయంగా తగ్గింది. ఒకప్పుడు 50 వేల ఎకరాల్లో సాగయ్యే పసుపు పంట ప్రస్తుత ఏడాదికి వచ్చేసరికి 20 వేల ఎకరాలకు తగ్గింది. కాగా పసుపు పంటకు ఈ ఏడాది మంచి ధర దక్కింది. క్వింటాలుకు రూ.18 వేల వరకు పలుకుతోంది. ఇక పసుపు బోర్డును ఇందూరులోనే ఏర్పాటు చేస్తామని ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రకటించడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సామాజిక పింఛన్లు

సామాజిక భద్రత పింఛన్లు పొందే వారి సంఖ్య గతంలో 1,64,064 మంది ఉండగా, ఇప్పు డు 2,73,866కు చేరింది. దివ్యాంగులకు రూ.4,0 16, ఇతర లబ్ధిదారులకు రూ.2,016 అందజేస్తున్నారు.

చెరువుల పునరుద్ధరణ

మిషన్ భగీరథ కింద జిల్లాలో 2,60,383 నల్లా కనెక్షన్‌లు ఇచ్చి నీటి సరఫరా చేస్తున్నారు. మిషన్ కాకతీయ కింద జిల్లాలో 841 చెరువులకు రూ.348 కోట్లు మంజూరు కాగా, రూ.251 కోట్లతో 765 చెరువుల పనులు పూర్తి చేశారు. రోడ్లు భవనాల శాఖ ద్వారా జిల్లాలో 2,358 కోట్లతో పనులు చేశారు. విద్యుత్ శాఖ ద్వారా రూ.450 కోట్లతో సబ్‌స్టేషన్లు, 33కేవీ లైన్లు, 11కేవీ లైన్లు, ఎల్‌టీ లైన్లు, పవర్, డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు నిర్మించారు.

■ జిల్లాలో రెండువిడతల్లో 7,14,975 మందికి కంటివెలుగు సేవలు అందించారు. నిజామాబాద్, బోధన్, ఆర్మూర్ ఆస్పత్రుల్లో డయాలసిస్ సేవలు చేస్తున్నారు. పదేళ్లలో కాన్పులు 26,140 చేశారు. కేసీఆర్ కిట్లు 22,408 మందికి ఇచ్చారు. న్యూట్రిషన్ కిట్లు 3,030 మందికి ఇచ్చారు.

పెరిగిన గురుకులాలు

2014 నుంచి ఇప్పటివరకు జిల్లాలో బీసీ గురుకులాలు 19కి పెరిగాయి. ఇందులో రెండు డిగ్రీ కళాశాలలు ఉన్నాయి. గతంలో జిల్లాలో కేవలం ఒక్క గురుకుల పాఠశాల మాత్రమే ఉంది. ఎస్టీ గురుకులాలు 13 ఉన్నాయి. 2014కు ముందు రెండు ఎస్టీ గురుకుల పాఠశాలలు, కళాశాలలు మాత్రమే ఉండేవి.

ఎస్సారెస్పీ పునరుజ్జీవన పథకం

ఎస్సారెస్పీ పునరుజ్జీవన పథకానికి అప్పటి సీఎం కేసీఆర్ 2017 ఆగస్టు 10న శంకుస్థాపన చేశారు. రూ.1,069 కోట్లతో నిర్మాణ పనులు ప్రారంభించారు. కాళేశ్వరం నుంచి రివర్స్ పంపింగ్ ద్వారా ఎస్సారెస్పీకి నీటి సరఫరా చేసి సకాలంలో ఆయకట్టుకు నీరందించాలనే లక్ష్యంతో నిర్మాణం చేపట్టారు. 2019లో ట్రయల్ రన్ చేశారు. 2023లో పునరుజ్జీవన పథకాన్ని ప్రారంభించి 2.5 టీఎంసీల నీటిని కాళేశ్వరం నుంచి ఎస్సారెస్పీకి తరలించారు. ఈ పథకంతో ఎస్సారెస్పీకి ఆశించిన స్థాయిలో ప్రయోజనం చేకూరలేదు. బాహుబలి మోటార్లు కావడంతో ఆయకట్టు సాగుకు నీటి సరఫరా కోసం విద్యుత్ బిల్లులు అధికమయ్యాయని విమర్శలు వచ్చాయి. వరద కాలువ ద్వారా నీటి సరఫరా రివర్స్ పంపింగ్‌తో చేపట్టడం కారణంగా వరద కాలువకు ఇరువైపులా భూముల్లో మాత్రం భూగర్భ జలాలు పెరిగాయి.



కాళేశ్వరం పనులు..

కాళేశ్వరం 21వ ప్యాకేజీ కింద ఆయకట్టు స్థిరీకరణ కోసం మోపాల్ మండలం మంచిప్ప వద్ద 3.5 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యంతో జలాశయం నిర్మాణం కోసం పనులు ప్రారంభించారు. పైప్‌లైన్, పంప్‌హౌస్, సర్జిపూల్ పనులు తుదిదశకు వచ్చాయి. అయితే కొత్తగా వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం 1.5 టీఎంసీల సామర్థ్యంతో మాత్రమే జలాశయాన్ని పరిమితం చేసి ముంపు లేకుండా చేయాలని నిర్ణయం తీసుకుంది.

■ శ్రీరాంసాగర్ బ్యాక్‌వాటర్ నుంచి బాసర వరకు బోటింగ్, ఎకోటూరిజం ప్రాజెక్టు ప్రతిపాదనలు ఉన్నప్పటికీ ముందుకు పడలేదు.

నగరంలో రూ. వెయ్యి కోట్ల పనులు

నిజామాబాద్ నగరంలో సుమారు రూ.వెయ్యి కోట్లతో పనులు చేశారు. రూ.240 కోట్ల విలువైన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు నడుస్తున్నాయి. బొడ్డెమ్మ చెరువు పనులు పూర్తయ్యాయి. హైదరాబాద్ రోడ్డులో కీలకమైన మాధవనగర్ రైల్వే ఓవర్ బ్రిడ్జి పనులు వేగంగా నడుస్తున్నాయి.

■ దేశంలోనే ప్రసిద్ధిగాంచిన బోధన్‌లోని నిజాం షుగర్స్ ఫ్యాక్టరీ జిల్లాలో ఎకానమీకి గతంలో మంచి ఊతం ఇస్తూ వచ్చింది. అయితే 2015 డిసెంబర్‌లో ఈ ఫ్యాక్టరీ మూతపడింది. దీన్ని వచ్చే సెప్టెంబర్ 17లోగా తెరిపించనున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారు.

పసుపులో పది రకాలు..

- నూతన వంగడాలతో పసుపు సాగు చేస్తున్న మగ్గిడి యువరైతు
- రాష్ట్ర ఏర్పాటు తర్వాత చిన్నారెడ్డికి లభించిన గుర్తింపు



పసుపును చూపుతున్న యువరైతు చిన్నారెడ్డి

డొంకేశ్వర్(ఆర్మూర్): తెలంగాణ రాష్ట్రం ఏర్పడక ముందు పసుపు రైతులకు పెద్దగా గుర్తింపు ఉండేది కాదు. అప్పట్లో పసుపు రైతులను ప్రోత్సహించే ప్రభుత్వాలు కూడా లేవు. అయితే ప్రత్యేక రాష్ట్రం అవతరించిన తర్వాత పసుపు రైతులకు గౌరవం, గుర్తింపు లభించింది. మార్కెట్‌లో ధర ఉన్నా, లేకపోయినా కొంతమంది రైతులు సంప్రదాయ వాణిజ్య పంటను మాత్రం వదులుకోలేదు. అందులో ఒకరు ఆర్మూర్ మండలం మగ్గిడి గ్రామానికి చెందిన యువరైతు నలిమెల చిన్నారెడ్డి. పదేళ్ల క్రితం ఒకే రకం పసుపును సాగు చేసిన ఈయన రాష్ట్ర ఏర్పాటు తర్వాత విభిన్నరకాలతో వైవిధ్య సాగుకు శ్రీకారం చుట్టాడు. తనకున్న ఆరెకరాల వ్యవసాయ భూమిలో అంచెలంచెలుగా పదిరకాల వంగడాలను సాగు చేస్తూ అందరినీ అబ్బురపరుస్తున్నాడు. రాజేంద్ర సోనియా, రాజేంద్ర సోనాలి, ప్రగతి, ఏసీసీ-79, లకడాంగ్, పీతాంబర్, క్షేలం, రాజపురి, బీఎస్ఆర్-2, ఎర్రగుంటూరు రకాలను సాగు చేసి వాటి విత్తనాలను ఇతర రైతులకు విక్రయిస్తున్నాడు. వరంగల్, కర్నూల్, ఆదిలాబాద్, మంచిర్యాల్, కొండగట్టు, మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల రైతులు చిన్నారెడ్డి నుంచి విత్తనాలు కొనుగోలు చేస్తున్నారు. ఎందుకంటే ఈయన తయారు చేసిన విత్తనాల్లో అధిక శాతం కర్కుమిన్ ఉంటుంది. పచ్చి పసుపు ఎకరానికి 160-180 క్వింటాళ్ల వరకు దిగుబడిని సాధిస్తూ సిసలైన పసుపు రైతుగా పిన్న వయసులోనే చిన్నారెడ్డి సక్సెస్‌ఫుల్‌గా నిలిచి ఇతరులకు ఆదర్శమయ్యాడు. పదిరకాలు సాగు చేస్తూ పసుపు రారాజుగా పేరొందిన ఈ యువరైతుకు తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత తగిన గుర్తింపు లభించింది. 2015 రాష్ట్ర అవతరణ వేడుకల్లో ఉత్తమ రైతుగా అవార్డును అందుకున్నాడు. 2018లో అప్పటి మంత్రి నిరంజన్ రెడ్డి, 2022లో అప్పటి జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి చేతుల మీదుగా సత్కారం పొంది అవార్డులను అందుకున్నాడు. జాతీయ, రాష్ట్ర స్థాయి పసుపు రైతుల సదస్సులకు సైతం ఆహ్వానాలు అందాయి. అయితే, తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తొలిసారిగా 2024 సంవత్సరంలో పసుపు పంటకు క్వింటాలుకు రూ.18 వేల వరకు ధర వచ్చిందని, దీంతో పసుపు రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారని చిన్నారెడ్డి పేర్కొంటున్నారు. ధరను ఇలాగే కొనసాగించి పసుపు రైతులను ప్రభుత్వాలు ప్రోత్సహించాలని కోరుతున్నారు.

తాగునీటికి సాగర్ జలాలు

- నేటి నుంచి ప్రధాన కాలువకు నీటి విడుదల

నిజాంసాగర్(జుక్కల్): ఉమ్మడి నిజామాబాద్ జిల్లా కేంద్రంతో పాటు బోధన్, బాన్సువాడ పట్టణ ప్రజల తాగునీటి అవసరాల కోసం నిజాంసాగర్ ప్రాజెక్టు నుంచి ప్రధాన కాలువకు ఆదివారం నీటిని విడుదల చేయనున్నారు. బోధన్, నిజామాబాద్ పట్టణ ప్రాంతాలకు అలీసాగర్ రిజర్వాయర్ ద్వారా నీటిని సరఫరా చేసునున్నారు. అలీసార్ రిజర్వాయర్ 300 ఎంసీఎఫ్‌టీలకు గాను ప్రస్తుతం 100 ఎంసీఎఫ్‌టీల నీరు మాత్రం నిల్వ ఉంది. దీంతో నిజాంసాగర్ ప్రాజెక్టు నుంచి ప్రధాన కాలువకు నీటిని విడుదల చేసి, అలీసాగర్ రిజర్వాయర్‌కు నీరందించనున్నారు.



నిజాంసాగర్ ప్రాజెక్టు తాజా నీటిమట్టం

సాగర్ 4.8 టీఎంసీల నీరు నిల్వ

నిజాంసాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 17.8 టీఎంసీలకు గాను ప్రస్తుతం 4.8 టీఎంసీల నీరు నిల్వ ఉంది. యాసంగి పంటలకు ప్రాజెక్టు నుంచి ప్రధాన కాలువకు పలు దఫాల్లో 12 టీఎంసీల నీటిని విడుదల చేశారు. ఆయకట్టు పంటలు గట్టెక్కడంతో ప్రస్తుతం ప్రాజెక్టులో 4.8 టీఎంసీల మేర నీరు నిల్వ ఉంది. ప్రస్తుతం వానాకాలం పంటల సాగు, వరి నారుమళ్లు వేసుకునేందుకు నిజాంసాగర్ ప్రాజెక్టు నీటి నిల్వలు ఆయకట్టు ప్రాంత రైతులకు భరోసాగా ఉన్నాయి. అయితే ప్రధాన కాలువ కింద బోరు బావులు ఉన్న వర్ని, కోటగిరి, రుద్రూర్, నస్రుల్లాబాద్, బాన్సువాడ మండలాల రైతులు నారుమళ్లు వేస్తున్నారు. పదిహేను రోజుల్లో వరి నాట్లకు సిద్ధం కానున్నారు.

ఎరువులు మింగేశారు

- మాక్లూర్ సొసైటీలో మరో కుంభకోణం
- రూ.70.50 లక్షల ఎరువులు మాయం
- గత చైర్మన్, కార్యదర్శి హయాంలోనే జరిగినట్లు నిర్ధారణ !

మాక్లూర్: వివాదాలకు కేంద్రబిందువైన మాక్లూర్ సొసైటీలో మరో కుంభకోణం వెలుగుచూసింది. రూ.70లక్షల 50వేల విలువైన ఎరువుల బస్తాలను మాయం చేశారు. ఇదంతా గత చైర్మన్, కార్యదర్శి హయాంలోనే జరిగినట్లు తెలుస్తోంది. డిసెంబర్ వరకు చైర్‌పర్సన్‌గా సొసైటీ చైర్‌పర్సన్‌గా కొనసాగిన గోవు లక్ష్మి వ్యక్తిగత కారణాలను చూపుతూ పదవికి రాజీనామా చేయగా.. ఆమె స్థానంలో బూరోల్ల అశోక్ ఇన్‌చార్జి చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించారు. అలాగే గతంలో కొనసాగిన సొసైటీ కార్యదర్శి సంతోష్ స్థానంలో విష్ణువర్ధన్ మే 3న కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టారు.

మాక్లూర్ సొసైటీతోపాటు 5 సబ్ బ్రాంచీల్లో మొత్తం రూ.88 లక్షల 37 వేల విలువైన ఎరువుల బస్తాల స్టాకు ఉన్నట్లు గతంలో పని చేసిన కార్యదర్శి సంతోష్ నూతన కార్యదర్శి విష్ణువర్ధన్‌కు అధికారికంగా వివరాలు అందజేశారు. మే 4, 5 తేదీల్లో మాక్లూర్ గోదాములో ఎరువుల లెక్క తీసిన విష్ణువర్ధన్ వాస్తవపరిస్థితిని చూసి విస్తుపోయారు. అధికారిక లెక్క ప్రకారం ఒక్క మాక్లూర్ సొసైటీ గోదాములో రూ.18 లక్షల 49 వేల విలువైన ఎరువుల బస్తాలు ఉండా ల్సి ఉండడగా, అక్కడ ఉన్నది కేవ లం రూ.2 లక్షల 33 వేల విలువైన ఎరువులు మాత్రమే. దీంతో ఏమి చేయాలో తెలియక ప్రస్తుత కార్యదర్శి విష్ణువర్ధన్ ఉన్నతాధికారి దృష్టికి విషయాన్ని తీసుకెళ్లాడు. స్పందించిన సదరు అధికారి విచారణ నిమిత్తం ఇద్దరు ప్రత్యేక అధికారుల ను నియమించగా, వారు సబ్ బ్రాంచీల్లో స్థానిక రైతుల సమక్షంలో తనిఖీలు నిర్వహించారు. అధికారికంగా రూ.88లక్షలకు పైగా విలువైన ఎరువుల స్టాక్ ఉన్నట్లు చూపినప్పటికీ వాస్తవంగా రూ.17.84లక్షల స్టాక్ ఉందని, మిగతా మొత్తాన్ని మాయం చేశారని తేల్చారు. ఇది లా ఉండగా, కొందరు పాలకవర్గ సభ్యులు తమ అవసరాల నిమిత్తం సొసైటీ నుంచి అనామతుగా రూ.45 లక్షలు (అందరివి కలిపి) తీసుకుని ఇంతవరకు జమ చేయలేదని విచారణ అధికారులు ఉన్నతాధికారికి నివేదిక అందజేసినట్లు తెలిసింది. ఇలా మాక్లూర్ సొసైటీలో అవినీతి ఒక్కొక్కటిగా బయటపడుతుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.



మాక్లూర్ సహకార సొసైటీ

మాక్లూర్ సొసైటీ, సబ్ బ్రాంచీల్లో ఎరువుల నిల్వలు

సొసైటీ మరియు సబ్‌బ్రాంచ్	అధికారికంగా చూపిన స్టాక్ విలువ(రూ.ల్లో)	వాస్తవంగా ఉన్న నిల్వ విలువ
మాక్లూర్	18,49,684	2,33,418
కల్లెడి	17,05,442	5,55,960
ఢీకంపల్లి	8,79,498	4,58,540
గుత్ప	31,00,518	2,67,876
గొట్టుముక్కల	4,27,970	1,21,670
చికి	8,74,034	1,47,088
మొత్తం	88,37,146	17,84,552









తహసీల్‌ ఎదుట రైతుల ఆందోళన

- ఫొలాలకు విద్యుత్‌ కనెక్షన్‌ పనులు నిలిపివేయడంతో ధర్నా
- కుటుంబ సభ్యులతో కలిసి పురుగు మందు డబ్బాలతో నిరసన


కమ్మర్‌పల్లి తహసీల్‌ ఎదుట బైఠాయించి నిరసన తెలుపుతున్న రైతులు

కమ్మర్‌పల్లి: తమ వ్యవసాయ భూముల్లో విద్యుత్‌ కనెక్షన్‌ పనులు ఎందుకు నిలుపుదల చేయించారని ప్రశ్నిస్తూ కమ్మర్‌పల్లి తహసీల్‌ కార్యాలయం ఎదుట శనివారం సాయంత్రం చౌట్‌పల్లికి చెందిన రైతులు బైఠాయించారు. మాజీ సర్పంచ్‌ మారు శంకర్‌, బద్దం రాజేశ్వర్‌, కొమ్ముల వెంకన్న, కొట్టాల రాజేశ్వర్‌లు తమ కుటుంబ సభ్యులతో కలిసి పురుగు మందుల డబ్బాతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. 9 నెలల క్రితం వ్యవసాయ విద్యుత్‌ కనెక్షన్‌ కోసం ట్రాన్స్‌కోకు దరఖాస్తు చేసుకొని డీడీలు చెల్లించామన్నారు. ట్రాన్స్‌కో అధికారులు ఆ భూముల్లో స్తంభాలు వేయించారు. తీగలు బిగించే పని మిగిలి ఉండగా, తహసీల్దార్‌ ఆంజనేయులు ఏఈ కృష్ణకు ఫోన్‌ చేసి విద్యుత్‌ లైన్‌ పనులు నిలుపుదల చేయాలని ఆదేశించారన్నారు. ఆ భూములపై వివాదం ఉందని పనులు ఆపేయాలని సూచించారన్నారు. కాంగ్రెస్‌ నేత సునీల్‌రెడ్డి ప్రోద్బలంతోనే తమ భూముల్లో పనులు నిలిపి వేశారని రైతులు ఆరోపించారు. సమాచారం అందుకున్న పోలీసులు తహసీల్‌ కార్యాలయానికి చేరుకొని రైతుల వద్ద నుంచి పురుగుల మందు డబ్బాను లాక్కున్నారు. ఎస్సై రాజశేఖర్‌ సమక్షంలో రైతులు తహసీల్దార్‌తో చర్చించారు. మంత్రి కొండా సురేఖ నుంచి ఆ భూమి స్వభావం ఏమిటో తేల్చాలని లేఖ తమకు అందిందని తహసీల్దార్‌ రైతులకు వివరించారు. ఇలా ఎన్నిసార్లు ల్యాండ్‌ సర్వే చేస్తారని రైతులు ప్రశ్నించారు. కావాలనే తమను సతాయిస్తున్నారని రైతులు మండిపడ్డారు. చివరకు తహసీల్దార్‌, ఉన్నతాధికారులను ఫోన్‌లో మాట్లాడారు. ఈ నెల 12న భూమి సర్వే చేసి రిపోర్టు సమర్పిస్తామని తహసీల్దార్‌ ఆంజనేయులు తెలియజేశారు. దీంతో రైతులు వెనుదిరిగారు.

వృత్తి పునరుద్ధరణ దరఖాస్తులకు నోటిఫికేషన్‌

ఖలీల్‌వాడి: న్యాయవాదులుగా కొనసాగుతున్న వారు తమ వృత్తి పునరుద్ధరణకు దరఖాస్తు చేసుకోవాలని తెలంగాణ రాష్ట్ర బార్‌ కౌన్సిల్‌ సభ్యుడు మంథని రాజేందర్‌ రెడ్డి తెలిపారు. ప్రతి న్యాయవాది విధిగా సర్టిఫికెట్‌ ఆఫ్‌ ప్రాక్టీస్‌ ఫాంను తెలంగాణ రాష్ట్ర బార్‌ కౌన్సిల్‌ కార్యాలయంలో సమర్పించాలని కోరారు. తెలంగాణ రాష్ట్ర బార్‌ కౌన్సిల్‌ ఎన్రోల్‌ సర్టిఫికెట్‌, సర్టిఫికెట్‌ ఆఫ్‌ ప్రాక్టీస్‌ లేదా బార్‌ కౌన్సిల్‌ జారీచేసిన న్యాయవాది గుర్తింపు కార్డు, ఒక పాస్‌ పోర్ట్‌ సైజ్‌ ఫొటో, టీఎస్‌సీవోపీ వెరిఫికేషన్‌ ఫండ్‌ పేరున రూ.500 డిమాండ్‌ డ్రాఫ్ట్‌ హైదరాబాద్‌లో చెల్లుబాటు అయ్యేవిధంగా లేదా హైదరాబాద్‌లోని తెలంగాణ రాష్ట్ర బార్‌ కౌన్సిల్‌ కార్యాలయంలో దరఖాస్తుతో పాటు నగదు చెల్లించవచ్చని తెలిపారు. ఐదేళ్లుగా సంబంధిత కోర్టులలో న్యాయవాదిగా వృతిలో కొనసాగుతున్నట్లుగా వకాలత్‌ నామాలు, మెమో ఆఫ్‌ అప్పియరన్స్‌, కోర్టుల కాజ్‌ లిస్ట్‌, జడ్జిమెంట్స్‌, ఆర్డర్స్‌ జత చేయాలని పేర్కొన్నారు. దరఖాస్తులలో సంబంధిత బార్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడు లేదా ప్రధాన కార్యదర్శి సంతకం తీసుకోవాలని సూచించారు.







క్రైం కార్నర్‌

వరద కాలువలో పడి ఒకరి మృతి

మోర్తాడ్‌(బాల్కొండ): పాలెం శివారులోని వరద కాలువలో పడి మోర్తాడ్‌ మండల కేంద్రానికి చెందిన కూరగాయల సుధాకర్‌(34) అనే వ్యక్తి మృతి చెందాడు. ఆయన మృతదేహం శనివారం లభ్యమైంది. సుధాకర్‌ మానసిక స్థితి ఇటీవల సరిగా లేదు. మద్యం కూడా సేవిస్తుండేవాడని స్థానికులు చెబుతున్నారు. శుక్రవారం ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. ప్రమాదవశాత్తు వరద కాలువలో పడి ఉంటాడని స్థానికులు సందేహం వ్యక్తం చేస్తున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అనిల్‌ రెడ్డి తెలిపారు. శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆర్మూర్‌ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై తెలిపారు.

విద్యుత్‌ షాక్‌తో మరొకరు..

నస్రుల్లాబాద్‌(బాన్సువాడ): దుర్కి గ్రామంలో బర్ల సాయిబాబా(35) అనే వ్యక్తి శనివారం విద్యుత్‌ షాక్‌కు గురై మృతి చెందాడు. పాత బాన్సువాడకు చెందిన సాయిబాబా పట్టణంలో గల రామకృష్ణ ఏజెన్సీస్‌లో కూలిగా పని చేస్తాడు. అందులో భాగంగా దుర్కి గ్రామంలో సామాను దింపడానికి వచ్చాడు. సామాను దింపుతున్న సమయంలో 11కేవీ లైన్‌ తగిలి విద్యుత్‌ షాక్‌కు గురయ్యాడు. తీవ్రంగా గాయపడ్డ ఆయన బాన్సువాడ ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందాడని కుటుంబీకులు తెలిపారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

బోధన్‌టౌన్‌(బోధన్‌): పట్టణంలోని శర్బతీకెనాల్‌లో గుర్తు తెలియని పురుషుడి మృతదేహం లభ్యమైనట్లు పట్టణ సీఐ వీరయ్య తెలిపారు. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. రెండు రోజులుగా మృతుడి ఆచూకీ తెలియడం లేదని, ఆచూకీ తెలిసిన వారు 87126 59870 నంబర్‌కు ఫోన్‌ చేయాలని కోరారు.

ట్రాక్టర్‌ కింద పడి బాలిక మృతి


కల్పిత(ఫైల్‌)

భీమ్‌గల్‌: ట్రాక్టర్‌ కింద పడి బాలిక మృతి చెందిన ఘటన పురాణిపేట్‌ గ్రామంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు.. పురాణిపేట్‌ గ్రామానికి చెందిన రౌతు సంతోష్‌ కుమార్తె కల్పిత(9) ఇంటి దగ్గర ఉన్న ట్రాక్టర్‌పైన ఆడుకుంటుండగా.. అనుకోకుండా ట్రాక్టర్‌ స్టార్ట్‌ అయ్యి, ముందుకు కదిలింది. దీంతో బాలిక భయపడి ట్రాక్టర్‌ మీద నుంచి కిందకి దూకగా.. ఆమెపై నుండే ట్రాక్టర్‌ వెళ్లింది. దీంతో బాలిక అక్కడికక్కడే మృతి చెందింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని, మృత దేహాన్ని ఆర్మూర్‌ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

బైక్‌ను ఢీకొన్న ట్రావెల్స్‌ బస్సు

- యువకుడి మృతి.. మరొకరికి గాయాలు


రాకేష్‌ రావు(ఫైల్‌)

కామారెడ్డి క్రైం: ఓ ట్రావెల్స్‌ బస్సు డ్రైవర్‌ అజాగ్రత్త, అతివేగం రాకేశ్‌ రావు(26) అనే యువకుడి నిండు ప్రాణాన్ని బలిగొంది. వివరాలు.. కామారెడ్డి మండలం చిన్నమల్లారెడ్డి గ్రామానికి చెందిన రాకేష్‌ రావు(26), ఆయన స్నేహితుడు చాకలి రాకేష్‌లు బైక్‌పై కామారెడ్డి నుంచి స్వగ్రామానికి వెళ్తుండగా రాత్రి 10 గంటల సమయంలో నిజాంసాగర్‌ చౌరస్తా వద్ద వెనక నుంచి ట్రావెల్స్‌ బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు కాగా పోలీసులు వెంటనే ఏరియా ఆస్పత్రికి తరలించారు. రాకేష్‌ రావు పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యులు హైదరాబాద్‌కు రిఫర్‌ చేశారు. హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందినట్లు పట్టణ ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్‌ రెడ్డి తెలిపారు. మృతుడి భార్య సుస్మిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు..


సుభాష్‌ మృతదేహం

రుద్రూర్‌: కోటగిరి మండలం బస్వాపూర్‌ గ్రామానికి చెందిన బాటి సుభాష్‌(42)అనే వ్యక్తి శనివారం రోడ్డు ప్రమాదంలో మృతి చెందినట్లు కోటగిరి ఎస్సై సందీప్‌ తెలిపారు. వివరాలు.. కోటగిరి నుంచి బస్వాపూర్‌కు ఎక్సెల్‌ వాహనంపై సుభాష్‌ వెళ్తుండగా.. ఎక్లాస్‌పూర్‌ వద్ద వాహనం అదుపుతప్పి చెట్టుకు ఢీకొట్టాడు. ఈ ఘటనలో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య గంగ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్‌

డిచ్‌పల్లి: నడిపల్లి శివారులో పేకాట ఆడుతున్నారనే సమాచారంతో దాడి చేసి ఏడుగురిని అరెస్ట్‌ చేసినట్లు డిచ్‌పల్లి ఎస్సై మహేశ్‌ సోమవారం తెలిపారు. వారి వద్ద నుంచి రూ.2,250 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

భారీగా పీడీఎస్‌ బియ్యం పట్టివేత

ఖలీల్‌వాడి: నగర ఒకటో టౌన్‌ పోలీస్‌ స్టేషన్‌ పరిధి మిర్చి కాంపౌండ్‌లోని ఓ రైస్‌ మిల్‌పై శుక్రవారం రాత్రి టాస్క్‌ఫోర్స్‌ అధికారులు ఆకస్మిక దాడులు నిర్వహించారు. భారీగా పీడీఎస్‌ బియ్యాన్ని పట్టుకున్నట్లు తెలిసింది. పీడీఎస్‌ బియ్యాన్ని రీసైక్లింగ్‌ చేస్తున్నారనే సమాచారంతో టాస్క్‌ ఫోర్స్‌ పోలీసులు దాడులు చేశారు. ఈ దాడులలో సుమారు 400 నుంచి 500 క్వింటాళ్ల వరకు ఉన్నట్లు గుర్తించినట్లు తెలుస్తోంది. రైస్‌ మిల్లుకు టాస్క్‌ ఫోర్స్‌ పోలీసులు తాళాలు వేసి వెళ్లిపోయినట్లు తెలిసింది. రెవెన్యూ అధికారులు, ఒకటవ టౌన్‌ పోలీసులకు అప్పగించలేదు. టాస్క్‌ ఫోర్స్‌ సీఐను వివరణ కోరగా పైఅధికారులకు తెలుసునని దాటవేశారు.

గోవులను తరలిస్తున్న ఇద్దరిపై కేసు నమోదు

భిక్కనూరు: పరిమితికి మించి వాహనంలో పశువులు తరలిస్తున్న ఇద్దరిపై కేసు నమోదు చేసి వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు భిక్కనూరు ఎస్సై సాయికుమార్‌ శనివారం తెలిపారు. భిక్కనూరు టోల్‌ప్లాజా వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా ఒక వాహనంలో ఐదు పెద్ద గోవులు, నాలుగు చిన్న ఆవు దూడలు కనిపించాయని, వెంటనే గోవులను జంగంపల్లి గోషాలకు తరలించామని ఎస్సై వివరించారు.

నగరంలో కత్తిపోట్ల కలకం

ఖలీల్‌ వాడి: నగరంలోని ఆరవ టౌన్‌ పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో గల ధర్మపురి హిల్స్‌లో శనివారం కత్తిపోట్ల కలకలం రేగింది. వివరాలు.. డెయిరీ ఫామ్‌ చెందిన మొహమ్మద్‌ అద్నాన్‌ తన నలుగురు స్నేహితులతో కలిసి ధర్మపురి హిల్స్‌కి వెళ్లాడు. అదే ప్రాంతానికి చెందిన అన్నదమ్ములు సమీర్‌, రేహాన్‌లు తమ స్నేహితులతో ఉన్నారు. అద్నాన్‌తో సమీర్‌, రేహాన్‌కు మాటా మాటా పెరిగి గొడవకు దారి తీసింది. సమీర్‌ను గతంలో కొట్టారని రేహాన్‌ కత్తితో మూకుమ్మడిగా మొహమ్మద్‌ అద్నాన్‌పై దాడి చేశాడు. దీనితో అద్నాన్‌ చెయ్యి తెగింది. తీవ్రంగా గాయపడటంతో అతడిని బోధన్‌ రోడ్డులోని సిటీ ఆస్పత్రికి తరలించారు. చేయి తెగడంతో వైద్యులు ఆపరేషన్‌ చేశారు. ఆస్పత్రికి సౌత్‌ సీఐ సురేష్‌, ఎస్సైలు వెళ్లి వివరాలు ఆరా తీశారు. కత్తితో దాడికి పాల్పడినా పోలీసులకు ఇరు వర్గాల వారు ఫిర్యాదు చేయలేదని తెలిసింది.

మహిళ మెడలోని బంగారు గొలుసు అపహరణ


బాధితురాలు లక్ష్మి

ఆర్మూర్‌ టౌన్‌: పెర్కిట్‌లోని జాతీయ రహదారి–44పై శనివారం సాయంత్రం ఓ మహిళ మెడలో నుంచి 3 తులాల బంగారు గొలుసును గుర్తు తెలియని దొంగలు ఎత్తుకెళ్లారు. వివరాలు.. మోర్తాడ్‌ మండల కేంద్రానికి చెందిన జిల్లా లక్ష్మి తన భర్తతో కలిసి బైకుపై మాక్లూర్‌ మండలం మదనపల్లిలోని వారి బంధువుల ఇంటికి వెళ్లారు. సాయంత్రం తిరిగి మోర్తాడ్‌ వస్తున్న సమయంలో పల్సర్‌ బైక్‌పై ముగ్గురు వచ్చి లక్ష్మి మెడలో నుంచి 3 తులాల బంగారు గొలుసును లాక్కెళ్లారు. ఆ సమయంలో బైక్‌ పైనుంచి పడిపోవడంతో తలకు గాయాలయ్యాయి. బాధితురాలు ఆర్మూర్‌ పోలీస్‌ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

కేశ్‌పల్లి యువకుడి అదృశ్యం

జక్రాన్‌పల్లి: కేశ్‌పల్లి గ్రామానికి చెందిన మున్నూరు జగదీష్‌(28) అనే యువకుడు ఈ నెల 31న అదృశ్యమైనట్లు ఎస్సై తిరుపతి తెలిపారు. వివరాలు..సాయంత్రం ఇంట్లో నుంచి బయటకు వెళ్లి వస్తానని చెప్పిన జగదీష్‌ ఇంటికి తిరిగి రాలేదు. తల్లి బాలమణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. ఎవరికైనా ఆచూకీ తెలిస్తే జక్రాన్‌పల్లి పోలీస్‌స్టేషన్‌కు సెల్‌ నెంబర్‌ 8712659853 ద్వారా తెలపాలని కోరారు.

కరెంట్‌ షాక్‌తో గేదె మృతి

రామారెడ్డి: కరెంట్‌ షాక్‌ తగిలి గేదె మృతి చెందిన ఘటన సదాశివనగర్‌ మండలంలోని కుప్రియాల్‌లో శనివారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన ఏలేటి రాజిరెడ్డికి చెందిన గేదె ఈ ఘటనలో చనిపోయింది. గేదె విలువ రూ.60 వేలు ఉంటుందని, నష్టపరిహారం ఇప్పించాలని రైతు కోరారు.







ముగ్గురు విద్యార్థుల డిబార్‌

తెయూ(డిచ్‌పల్లి): డిగ్రీ సెమిస్టర్‌ రెగ్యులర్‌, బ్యాక్‌లాగ్‌ పరీక్షల్లో శనివారం 627 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు అకడమిక్‌ ఆడిట్‌ సెల్‌ డైరెక్టర్‌ ప్రొఫెసర్‌ ఘంటా చంద్రశేఖర్‌ తెలిపారు. ఎల్లారెడ్డిలోని ప్రభుత్వ డిగ్రీ కాలేజ్‌, నిజామాబాద్‌ ఇందూరు ఉషోదయా మహిళా డిగ్రీ కాలేజ్‌, బోధన్‌లోని ఎస్వీ డిగ్రీ కాలేజ్‌ పరీక్షా కేంద్రంలో ఒకరు చొప్పున మొత్తం ముగ్గురు విద్యార్థులు మాల్‌ ప్రాక్టీస్‌కు పాల్పడుతూ డిబార్‌ అయినట్లు ఆయన తెలిపారు. డిగ్రీ 6వ సెమిస్టర్‌ రెగ్యులర్‌ పరీక్షలకు 7,642మంది విద్యార్థులకు గానూ 7,212 మంది, 1వ సెమిస్టర్‌ బ్యాక్‌లాగ్‌ పరీక్షలకు 3,798 మంది విద్యార్థులకు గానూ 3,599 మంది హాజరైనట్లు తెలిపారు.

